# డాక్టర్ జీరో



MVS
PUBLICATIONS

మధుబాబు

# డాక్టర్ జీరో

రాత్రి పదకొండు గంటల సమయం.

శరవేగంగా వచ్చి, రంగూన్ నగరంలోని 'ఇలావా' ఏరియాలో ఆగింది ఒక టాక్సీ. వెనుక సీటులోనుంచి ఇద్దరు వ్యక్తులు క్రిందికి దిగారు.

ఆరు అడుగుల ఆజానుబాహుడా యువకుడు. అతనికి సరియైన జోడీ ఆయువతి. ఎన్నిసార్లు చూసినా, మరోసారి చూడాలనిపించేటంత ఆకర్షణీయంగా వున్నారు వారిద్దరూ.

ఎవరో రంగూన్ రాజకుటుంబాలకు చెందినవారై ఉంటారు. ఈ ఠీవి, ఈదర్పం సామాన్యులకు రావు. ఆయువకుడు అందించిన కరెన్సీ నోటునుతీసుకుని టాక్సీని వెనక్కుతిప్పుతూ అనుకున్నాడు టాక్సీ డ్రయివర్.

వందగజాల దూరం వెళ్ళిన తరవాత, టాక్సీ సడన్ బ్రేకుతో ఆపి వెనక్కుతిరిగి చూశాడు.

అక్కడే వున్నారు వారిద్దరూ. సిగిరెట్ వెలిగిచుకుంటూ, చుట్టూ చూస్తున్నాడు ఆయువకుడు.

అతన్ని చూస్తుంటే- నెలరోజుల క్రితం, 'మేబన్' ఏరియాలో అల్లకల్లోలాన్ని సృష్టించిన చిరుతపులి మెదిలింది, టాక్సీడ్రయివర్ కళ్ళముందు.

అరూన్ అరణ్యాలనుంచి వచ్చిందా చిరుతపులి. పంజావేటుకు పదిమంది చొప్పున పడగొట్టి పోయింది.

సరిగ్గా అదినడిచినట్లే ఠీవిగా అడుగులు వేస్తున్నాడా యువకుడు. అతని చూపులు దాని చూపులు మాదిరిగానే వున్నాయి-గంభీరంగా.

అతి ప్రయత్నంమీద చూపులు మరల్చుకొని టాక్సీని కదిలించాడు టాక్సీడ్రయివర్. ఆవీధి పక్కనేవున్న చిన్న హోటల్ ముందు ఆపి క్రిందికిదిగాడు- కాఫీతాగి పోదామన్న వుద్దేశ్యంతో.

లోపలకుపోయి,'కాఫీకావాలి' అనబోయాడు. అతని మాట అతనినోటిలోనే ఆగిపోయింది. రివాల్వర్ మోతలు, చేతిబాంబుల ప్రేలుళ్ళు చెవులు చిల్లులు పడేటట్లు వినిపించటం ప్రారంభించాయి.

వాటిని అనుసరించి ఒక భయంకర శబ్దం వినవచ్చింది. భూకంపం వచ్చినట్లు కంపించింది ఇలావా ఏరియా అంతా-ఒక్కక్షణం పాటు.

భయాందోళనలతో, ఇళ్ళలోనుంచి బయటికి పరుగెత్తుకొచ్చారు ఇలావా ఏరియా నివాసులందరూ. ఆశబ్దాలు వినవస్తున్న దిశకు గుంపులు గుంపులుగా పరుగులు తీయటం మొదలుపెట్టారు.

కాఫీమాట మరిచిపోయాడు టాక్సీ డ్రయివర్. గబగబా బయటికి వచ్చి టాక్సీ ఎక్కాడు.

ఎవరో పోలీసులకు ఫోన్ చేస్తున్నట్లున్నారు- పోలీస్ వాన్స్ వస్తున్నట్లు దూరంనుంచి సైరన్ మోతలు వినబడుతున్నాయి.

“డాక్టర్ ఫిరాజుద్దీన్ బంగ్లామీద ఎవరో దుండగులు దాడిచేశారు. బాంబులు విసిరి బంగ్లాముందు భాగాన్ని నాశనం చేశారు” ప్రమాద ప్రదేశాన్ని చూసి వస్తున్న ఇలావా పౌరులు తమలో తాము గుసగుసలు చెప్పుకుంటున్నారు.

టాక్సీని మెల్లిగా ముందుకు పోనిస్తూ ఆమాటలు విన్నాడు టాక్సీ డ్రయివర్. డాక్టర్ ఫిరాజుద్దీన్ మంచి హాస్తవాసి వున్న వైద్యుడు. రంగూన్ నగరంలో ఆయనకున్న పేరు ప్రతిష్టలు మరే డాక్టరుకూలేవు.

అటువంటి మనిషిమీద, చీమకు కూడా అపకారం చేయనటువంటి ఆజంటిల్మన్ మీద - కక్ష కట్టాల్సిన అవసరం ఎవరికి వుంటుంది?

నాలుగు పోలీస్ వాన్లు, రెండు ఫైరింజన్లు శరవేగంతో వచ్చిపడ్డాయి. లాటీలు ధరించి వాన్లలోనుంచి కిందికి దిగుతున్న పోలీసులనుచూసి ఇలావా పౌరులు చెల్లాచెదురైపోయారు.

టాక్సీని ఒక సందులోకి పోనిచ్చి, అక్కడినుంచి మరో వీధిలోకి మరలించాడు టాక్సీ డ్రయివర్.

అతని హృదయంలో ఆలోచనలు అస్తవ్యస్తంగా అలుముకుంటున్నాయి. తాను వదిలి వచ్చిన యువతీయువకులకు, ఆగందరగోళానికి ఏమైనా సంబంధ మున్నదా?

చిరుతపులిలాంటివాడే ఆయువకుడు. అందులో సందేహం ఏమీ లేదు. కాని డాక్టర్ ఫిరాజుద్దీన్ మీద కక్షకట్టి అత్యాచారాలు సలిపే నీచగుణం అతనిలో వున్నట్లు అతనిలో కనిపించటంలేదు.

తన దారికి అడ్డువచ్చిన మృగాలనే మట్టుబెడుతుంది చిరుతపులి. దాని గంభీర మనస్తత్వం మరే అడవి జంతువుకూలేదు.

ఏమో!! డాక్టర్ ఫిరాజుద్దీన్ ఆయువకుడి దారికి అడ్డువెళ్ళాడేమో!!!

అర్థంలేని ఆలోచనలతో సతమతమౌతూ యధాలాపంగా టాక్సీని నడుపుతున్న టాక్సీ డ్రయివర్ వున్నట్లుండి వులిక్కిపడి, సడన్ బ్రేకుతో టాక్సీని ఆపుచేశాడు.

ఎదురుగా రోడ్డుమీద పదిమంది దృఢకాయులు నిలబడి వున్నారు. వారందరి దగ్గిరా, మోటార్ సైకిల్ చెన్లు, యినుపచువ్వలు, సోడాబాటిల్స్ వున్నాయి.

"రేయ్... టాక్సీ ఆపరా" ఉరుములాంటి గొంతుకతో అరిచి ముందుకు వచ్చాడొక దృఢకాయుడు.

టాక్సీ డ్రయివర్ శరీరం చెమటలతో నిండిపోయింది.

గొంతు తడిఆరి పోయింది. వణుకుతున్న చేతులతో ఇంజన్ ఆఫ్ చేసి, తలుపు తెరుచుకొని క్రిందికి దిగాడు.

"ఏరా... ఇందాక నువ్వు తీసుకువచ్చిన బద్మాష్ ఎక్కడరా? అసలు ఎక్కడినుంచి తీసుకువచ్చావ్?" చేతిలో వున్న

యినుపచువ్వను అతని భుజంమీద ఆనిస్తూ అడిగాడా దృఢకాయుడు.

టాక్సీ డ్రయివర్ గొంతు పూడ్చుకుపోయింది. మాట పెగల్లేదు ఎంత ప్రయత్నించినా.

"ఏరా మాట్లాడవ్?" ఉరిమాడు ఆదృఢకాయుడు.

టాక్సీ డ్రయివర్ మెదడు పనిచేయటం మానేసింది.

కాళ్ళూ చేతులతో సజావుగా ఇల్లు చేరుకుంటాననే ఆశ అతనిలో అంతరించింది.

ఫట్ మని శబ్దం చేస్తూ అతని ఎడమ భుజంమీద పడిందొక ఇనుపచువ్వ. ఎడమభుజం విరిగిపోయినంత బాధ కలిగింది. కెవ్వున అరిచి వెనక్కి గెంతాడు.

"చెప్పరా... ఏడి ఆ బద్మాష్? ఎక్కడ వున్నాడు?" గరగరమన్నాయి మరో రెండు కంఠాలు.

మరో రెండు ఇనుపచువ్వలు, సైకిల్ చైన్లు గాలిలోకి లేచాయి.

"నాకు తెలియదు... నాకేం తెలియదు... నన్ను కొట్టకండి... మీ కాళ్ళు పట్టుకొంటాను..." అతిప్రయత్నంమీద నాలుకను

స్వాధీనపరచుకొని అరిచాడు టాక్సీ డ్రయివర్. బాధతో, భయంతో అతనిగొంతు గద్గదమైంది. కళ్ళవెంట నీళ్లు తిరిగాయి.

“బాస్టర్డ్.... తెలియదంటే సరిపోతుందనుకున్నావా? వాడు ఎక్కడవున్నాడో చెప్పకపోతే నీ ప్రాణాలు నీవికావు...” ఐరన్ రాడ్ తో టాక్సీ డ్రయివర్ తలమీద కొడుతూ అన్నాడొక దృఢకాయుడు.

తలపగిలి వెచ్చటి రక్తం టాక్సీ డ్రయివర్ ముక్కుమీదికి జారింది. అతని కళ్ళముందు మెరుపులు, నక్షత్రాలు కనిపించసాగాయి.

వాటితోపాటు మేటన్ ఏరియాలో అతను చూసిన చిరుతపులి కూడా కనిపించింది. దానితోపాటు చిరుతపులిలా నడిచే ఆయువకుడు కూడా కనిపించాడు.

అప్రయత్నంగా అరిచాడతను. తనకు తెలియకుండానే ఆయువకుణ్ని వుద్దేశించి "సార్... నన్ను చంపేస్తున్నారు రక్షించండి...రక్షించండి!” అంటూ.

అరిచాడు గాని, ఆయుకుడు అక్కడికి ఎలా వస్తాడు అన్న ఆలోచన అతనికి కలగలేదు. అతనేమైనా దేవుడా? చూస్తూ చూస్తూ యమకింకరులలాంటి ఆగూండాల మీద కలబడటానికి అతనేమైనా పిచ్చివాడా?

అసలు తనకు సహాయం చేయాల్సిన అవసరం అతనికి ఏముంది? ప్రాణాలమీద తీపి టాక్సీ డ్రయివర్‌ని పిచ్చివాణ్ని చేసింది.

"సార్... రక్షించండి సార్.. సార్ రక్షించండి..." అని అరుస్తూ నేలమీద దొర్లసాగాడు.

"ఎవడురా ఆసారు? ఏడిరా? రమ్మనరా చూద్దాం?" అంటూ ఇనపచువ్వను ఎత్తి బలంగా టాక్సీ డ్రయివర్ తలమీద మోదాడు ఒక దృఢకాయుడు.

ఆదెబ్బతో టాక్సీ డ్రయివర్ తల రెండుగా విచ్చిపోవాలి... అతని ప్రాణాలు ఆక్షణంలోనే అనంత వాయువుల్లో కలిసిపోవాలి.....కాని.

అతని తలమీద పడలేదు ఆఇనుపచువ్వ.

అది కిందికి వాలకముందే గాలిలోనుంచి ప్రత్యక్షమైనట్లు, అడ్డుపడింది- ఒక బలమైన చెయ్యి.

ఇనుపచువ్వను పట్టుకొనివున్న దృఢకాయుణ్ని ఎత్తి ఇవతలకువిసిరేసింది.

"సార్....సార్..." అని అరుస్తున్న టాక్సీ డ్రయివర్ భుజంమీద మరొక చెయ్యి పడింది.

అది తన గొంతు పిసకటానికే వచ్చిందన్న భయంతో బిగుసుకుపోయాడతను.

"నీకేం భయంలేదు... లేచి కుర్చీలో కూర్చో..." చిరుగంటలు మోగినట్లు వినిపించింది ఒక కంఠం.

తన చెవులను తనే నమ్మలేక, కళ్ళు తెరిచి చూశాడు టాక్సీ డ్రయివర్.

అతని పక్కనే మోకరించి వుంది ఒక దేవకన్య - కాదు దేవకన్యలాంటి ఒక యువతి... చిరుతపులిలాంటి ఆయుకుడికి జోడీ...

అప్రయత్నంగా తలతిప్పి పక్కకు చూశాడు టాక్సీడ్రయివర్.

రోడ్డుమీద దారుణమైన పోరాటం కొనసాగుతున్నది.

ఒక సైకిల్ చైన్‌ని వశపరచుకొని, ఆపదిమంది గూండాలను పట్టి పట్టి, పంబరేగ కొడుతున్నాడు ఆ యువకుడు. బాంబులు పేలినట్లు పగులుతున్నాయి సోడాబాటిల్స్ గాజు పెంకులు కందిరీగలు ఎగిరినట్లు నాలుగు పక్కలకు విరజిమ్మబడుతున్నాయి.

"లేచి టాక్సీలో కూర్చో... ఇక్కడినుంచి వెళ్ళిపోదాం..." అంటూ సాయంపట్టి టాక్సీ డ్రయివర్ ని లేపి నిలబెట్టింది ఆయువతి.

కృతజ్ఞతతో టాక్సీ డ్రయివర్ కళ్ళు జలపాతాలైనాయి.

"అమ్మా! ఆపదలో వున్నప్పుడు సహాయంకోరితే, వచ్చి అడ్డుపడతాడు భగవంతుడు. ఆమాటవిని నవ్వేవాణ్ణమ్మా. వెక్కిరించి హేళనచేసేవాణ్ని. కాని యిప్పుడు అర్థంఅయింది తల్లీ... ఆమాటలో ఎంత నిజం వుందో బాగా అర్థం అయింది." అంటూ ఆయువతి చేతులు పట్టుకొని చిన్న పిల్లాడిలా విలపించాడు.

నవ్వుతూ, మృదువుగా చేతులు విడిపించుకొని, అతన్ని వెనుకసీటులో కూర్చోపెట్టింది ఆయువతి. స్టీరింగ్ ముందు కూర్చుని ఇంజన్ ని ఆన్ చేసింది.

రోడ్డుమీద- యువకుడి దెబ్బకు నలుగురు గూండాలు మట్టి తిన్నారు- మరో ఇద్దరు పారిపోతున్నారు.

గేర్ మార్చి టాక్సీని వేగంగా ముందుకు పోనిచ్చింది ఆయువతి. రోడ్డుమీది గూండాలు చెల్లా చెదురైపోయారు. ఆయువకుడు రబ్బర్ బంతిలా ఎగిరి బాయ్ నెట్ మీద కూర్చున్నాడు.

టాక్సీ మరింత వేగంతో ముందుకు దూకింది.

“బిందూ... అతనికి దెబ్బలు బలంగా తగిలాయా?” విండోమీదికి వంగి ఆయువతిని అడిగాడు ఆయువకుడు.

“యస్ రాజు... ఏద్తెనా హాస్పిటల్ కి తీసుకుపోవటం చాలా మంచింది.” అంటున్నది ఆయువతి.

“బిందు!! రాజు!!! పేర్లలో కూడా రాచఠీవి వుట్టిపడుతున్నది ఎవరు వీళ్ళు? మనుష్యులా? లేక దేవతలా?” అనుకుంటూ స్పృహతప్పి సీటుమీద వరిగి పోయాడు టాక్సీ డ్రయివర్.

*2*

“గెట్ అవుటాఫ్ రంగూన్ ! పన్నెండు గంటల్లోపల రంగూన్ సరిహద్దులు దాటకపోతే మీ యిద్దరి శవాలు ఇరావడీనదిలో తేలతాయి.!”

ఖరీదయిన ఆర్ట్ పేపర్ మీద అందంగా వ్రాయబడి వుంది ఆమెస్సేజి.

“రాజు! వీళ్ళ హెచ్చరికను పెడచెవినపెడితే, నిజంగానే మనల్ని ఇరావడీ నదిలోముంచి చంపుతారంటావా?” ఆ మెస్సేజిని అటూ యిటూ తిప్పి చూస్తూ అడిగింది బిందు.

పనామా పొగలతో గదినంతా ధూమ మయం చేస్తూ సోఫాలో కూర్చునివున్నాడు షాడో.

ఆలోచనలతో అతని కనుబొమ్మలు ముడిపడుతున్నాయి. అతని అంతరంగం అంతకుముందు రెండు రోజులనుంచీ ఎదురౌతున్న సంఘటనలను నెమరు వేసుకొంటున్నది.

రెండురోజుల క్రితం బిందును తీసుకొని హెడ్ క్వార్టర్స్ కి రమ్మనమని కబురు పంపించారు కులకర్ణి.

“రాజు! ఇది ఇంటర్ పోల్ కి సంబంధించిన వ్యవహారం. అందువల్ల కొంచెం జాగ్రత్తగా వ్యవహరించవలసిన వ్యవహారం.

జాగ్రత్తగా వ్యవహరించవలసిన వ్యవహారమైతే నావెంట బిందు దేనికీ? వంటరిగానే పోతాను.” అన్నాడు షాడో.

ఆమాట అనగానే బిందు వదనం ఎరుపురంగుకు తిరగటం గమనిస్తూనే వున్నాడు.

“బిందు వెంటవుంటే నీ ముక్కుకు తాడు వేసినట్లు అవుతుంది. ఒళ్ళు దగ్గిర పెట్టుకొని పనిచేస్తావ్!” నిర్మొహమాటంగా చెప్పేసి సిగార్ వెలిగించు కోవటంలో మునిగిపోయారు కులకర్ణి.

బిందు ముఖం వికసించింది. సీరియస్ గా టేబుల్ మీద ఫైలు అందుకొన్నాడు షాడో.

ఇంటర్ పోల్ పంపించిన ఫైలు అది.

డాక్టర్ జీరో అనే శాస్త్రవేత్త పదిసంవత్సరాలు కష్టపడి పరిశోధన చేసి కాన్సర్ వ్యాధి రాకుండా నిరోధించే మందును కనిపెట్టాడట. అద్వితీయమైన పరిశోధన అది. ప్రపంచంలో ఏ శాస్త్రజ్ఞునికీ లొంగకుండా తప్పించుకొని తిరుగుతున్నది కాన్సర్ రాకాసి. ఆ వ్యాధిరానే కూడదు. వచ్చిందంటే మరణమే అందుకు నివారణోపాయం.

డాక్టర్ జీరో పరిశోధనలు గౌరవించి, అతన్ని సన్మానిద్దామని ఎదురుచూస్తున్న ప్రపంచం - ఇప్పుడు అతనిపేరు వినబడితే చాలు భయాందోళనలతో కంపించిపోతుంది.

తన పరిశోధనలను మానవాళికి మంచిచేయటం కోసం వినియోగించకపోగా వినాశనానికి వుపయోగించదలచుకొన్నాడు డాక్టర్ జీరో.

కిల్లర్స్ గాంగ్ యిస్తానన్న డబ్బుకు ఆశపడి, తన పరిశోధనలను తారుమారుచేసి, కాన్సర్ కంటె భయంకరమైన జబ్బును సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాడు.

రంగూన్ నగర సమీపాల్లో ఎక్కడో అతనికి ఒక లాబరేటరీ కట్టి యిచ్చింది కిల్లర్స్ గాంగ్. అతనికి కావాల్సిన సదుపాయాలు నన్నిటినీ సమకూర్చింది.

డాక్టర్ జీరో అమెరికాలో వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. ఆసమయంలో అతనికి డాక్టర్ ఫిరాజుద్దీన్ అనబడే వ్యక్తితో పరిచయం అయింది. ఫిరాజుద్దీన్ ప్రస్తుతం రంగూన్ పట్టణంలోని ఇలావా ఏరియాలో నివసిస్తున్నాడు. తలవని తలంపుగా అతను డాక్టర్ జీరోని చూశాడు ఒకసారి. ఇద్దరూ తమ పాత స్నేహాన్ని పురస్కరించుకొని చాలాసేపు మాట్లాడుకున్నారట. ఆమాటల్లో డాక్టర్ జీరో చేస్తున్న భయంకర పరిశోధనల విషయం ఫిరాజుద్దీన్ కి స్వల్పంగా అవగతమైంది. వెంటనే అతను ఇంటర్ పోల్ కి తెలియచేశాడు.

ఎంతోమంది ఏజెంట్లు, డిటెక్టివ్ లు డాక్టర్ పిరాజుద్దీన్ ని కలుసుకొని, డాక్టర్ జీరోని గురించి వివరంగా తెలుసుకోవాలని ప్రయత్నించారు. ఫిరాజుద్దీన్ ఇంటర్ పోల్ కి కబురుపంపిననాటినుంచీ అతనికి బయటి ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు కట్ అయిపోయాయి. ఆయన్ను కలుసుకోవాలని ప్రయత్నించిన ఏజెంట్స్ ఎవరూ ప్రాణాలతో హెడ్ క్వార్టర్స్ కి తిరిగి రాలేదు.

మరింత పట్టుదలగా, మరికొంతమంది ఏజెంట్లను పంపిస్తే యీసారి డాక్టర్ ఫిరాజుద్దీన్ ప్రాణాలకే మోసం వస్తుందేమోనని భయపడింది ఇంటర్ పోల్. నేర్పుగా కార్యాన్ని సాధించగల వారిని పంపాలని నిర్ణయించుకున్నది.

"ఇంటర్ పోల్ ఏజెంట్ల లిస్టులో నువ్వు రెండవవాడివి రాజు! మొదటి ఏజెంటు మూడు రోజుల క్రితం రంగూన్ పక్కనేవున్న ఇరావడీ నదిలో తేలుతూ కనిపించాడు. ఇప్పుడు నీవంతు వచ్చింది. డాక్టర్ ఫిరాజుద్దీన్‌ని కలుసుకొని, డాక్టర్ జీరో వ్యవహారం ఏమిటో బాగా తెలుసుకో. ఆలేబరేటరీ ఎక్కడ వుందో తెలుసుకొని దాన్ని నాశనం చెయ్యి..."

"మరి డాక్టర్ జీరోని ఏం చెయ్యాలి?" అంటూ కులకర్ణి గారి మాటలకు అడ్డు వచ్చింది బిందు.

"అది మీరే ఆలోచించుకోవాలి?" క్లుప్తంగా అన్నారు కులకర్ణి.

పనామా వెలిగించి, పొగను సీలింగ్ వైపు వదులుతూ లేచి నిలబడ్డాడు షాడో.

"రాజు... కొంత కాలంగా కిల్లర్స్ గాంగ్ మనదారికి అడ్డంరావటంలేదు... ఈసారి వాళ్ళు తమ శక్తియుక్తుల నన్నిటినీ

కేంద్రీకరించుకొని మనల్ని ఎదిరించవచ్చు... బిందు నీతోవుంటే, నువ్వు నీ పాత కక్షలను, పురాతన పోరాటాలను గుర్తుకు తెచ్చుకోకుండా ఉంటావని, అనవసరంగా వాళ్ళని రెచ్చగొట్టకుండా యువతలికి వస్తావని, మాఆశ. దిసీజ్ నాట్ మై ఒపీనియన్... మన బిగ్ బాస్లు సజెస్ట్ చేసిన చిట్కా..." గది గుమ్మందాకా వచ్చి అన్నారు కులకర్ణి.

నవ్వుకొంటూ బయటికి వచ్చాడు షాడో. ఆరోజు సాయంత్రమే ఎయిర్ ఇండియా విమానంలో రంగూన్ చేరుకున్నాడు బిందుతో.

హోటల్ మైనాలో గది తీసుకొని రాత్రి పదిగంటల వేళకు టాక్సీలో ఇలావా ఏరియాకు వెళ్ళారు.

డాక్టర్ ఫిరాజుద్దీన్ బంగ్లాకు వంద గజాల ఇవతల టాక్సీ దిగి, నెమ్మదిగా బంగ్లాను సమీపించాడు.

మొదట నిర్మానుష్యంగా కనిపించింది అది. కాని ప్రహరీ గోడను సమీపించగానే, ఒక్కసారిగా మనుష్యులతో నిండిపోయింది. రివాల్వర్లు, మెషిన్ గన్లు నిప్పులు కక్కటం ప్రారంభించాయి.

డాక్టర్ ఫిరాజుద్దీన్ బంగ్లా శత్రువుల అధీనంలో వుంది అందుకే వచ్చిన ప్రతి ఏజెంటూ ప్రాణాలతో వెనక్కి రాలేకపోయాడు.

డాక్టర్‌ని కలుసుకోవటం అసాధ్యమని గ్రహించాడు షాడో. వెనుతిరక్క తప్పదని తెలుసుకొని లిటిల్ టామీని ప్రయోగించి చీకట్లలోకి తప్పుకున్నాడు.

లిటిల్ టామీ దెబ్బకు బంగ్లా ముందు భాగం నామరూపాలు లేకుండా నాశనమైపోయింది. ఆటంబాంబు ఫార్ములాతో చెయ్యబడినది కావటంవల్ల లిటిల్ టామీ తన ప్రేలుడుతో, ఇలావా ఏరియాను కంపింపచేసింది.

దాంతో ఇలావా నివాసులు ఇళ్ళల్లోనుంచి బయటికి వచ్చారు. పోలీసులు, ఫైరింజన్లు ప్రత్యక్షం కావటం జరిగింది.

ఇక ఇక్కడ వుండటం మంచిది కాదని గ్రహించి, బిందుతో పూర్తిగా వెనక్కి తగ్గాడు షాడో. వారిని వెతుకుతూ బయలుదేరారు శత్రువులు. వీధి పక్కన ఉన్న హోటల్ లో విచారించి టాక్సీ డ్రయివర్‌ని పట్టుకున్నారు.

అతని అరుపులు ఆర్తనాదాలు విన్న షాడో, ఆగలేక పోయాడు. టాక్సీ డ్రయివర్ ని చుట్టుముట్టిన వారిని చెల్లా చెదురు చేశాడు. బాగా గాయపడ్డాడు టాక్సీ డ్రయివర్. అతన్ని ఒక ప్రయివేట్ నర్సింగ్ హోమ్ లో చేర్చి తమ హోటల్ కి తిరిగి వచ్చారు షాడో, బిందులు.

తలుపు తెరిచిన మరుక్షణం- కార్పెట్ మీద పడివున్న చీటీ కనిపించింది.

రంగూన్ వదిలి వెళ్ళకపోతే చంపి ఇరావడీ నదిలో పడేస్తామని బెదిరించారు శత్రువులు అందులో.

ఎవరు? కిల్లర్స్ గాంగ్ వస్తాదులా? లేక డాక్టర్ ఫిరాజుద్దీన్ ఇంటిదగ్గిర మాటువేసి ఉన్న గూండాలా?

"ఏం చేద్దాం రాజు?" అంటూ రెట్టించి అడిగింది బిందు.

ఆమాటలతో తన ఆలోచనల నుండి బయటపడ్డాడు షాడో. వళ్ళు విరుచుకుంటూ లేచి, సిగిరెట్ ని గదిమూలకు విసిరికొట్టాడు.

***

ఇలావా ఏరియా అంతా అట్టుడికినట్లు వుడికిపోతున్నది. వీధుల్లో ఎక్కడ చూసినా జనం గుంపులు గుంపులుగా నిలబడివున్నారు. అందరి వదనాల్లోను భయాందోళనలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి.

డాక్టర్ ఫిరాజుద్దీన్ ఇంటిముందు పది పోలీస్ వాన్లు ఆగి ఉన్నాయి. ఇనుపటోపీలు ధరించిన రిజర్వ్ పోలీసులు బంగ్లాచుట్టూ కాపలా నిలబడి వున్నారు.

బంగ్లా సగభాగం నేల కూలివుంది. ఆరాళ్ళు గుట్టమీద జండా స్తంభం మాదిరిగా నిలబడి వుంది ఒక కాంక్రీట్ స్థంభం.

దానికి ఒక లావాటి తాడు వేలాడుతున్నది. ఆతాడు రెండవ కొసకు బిగించబడి, గాలి వీచినప్పుడల్లా, అటూ యిటూ వూగుతున్నది డాక్టర్ ఫీరాజుద్దీన్ శరీరం.

“పాపం... ఆత్మహత్య చేసుకున్నాడు... ఏం కష్టమో ఏమో!!” అనుకుంటున్నారు ఇలావా నివాసులు.

ఉదయం పదిగంటల వేళకు తమ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసుకొని, ఫిరాజుద్దీన్ శరీరాన్ని మార్చురీకి తీసుకుపోయారు పోలీసులు.

బంగ్లా దగ్గిర మాత్రం పాతికమంది పోలీసులు కాపలా నిలబడి వున్నారు. నెమ్మది నెమ్మదిగా అక్కడ గుమికూడిన జనం చెదిరిపోయారు. పాతికమంది వ్యక్తులు మాత్రం... ఆ పరిసరాల్ని వదిలిపోలేదు. అక్కడే తారట్లాడుతున్నారు.

"అయ్యా! కళ్ళులేని కబోదిని... మీరు దయతలచి ధర్మం చేస్తే మా కుడుపులు నిండుతాయి.... దయచూడండి..." అంటూ ఆ వీధిలోకి అడుగుపెట్టింది ఒక బిచ్చగత్తె- పదకొండు గంటల సమయంలో.

చిరిగి మట్టికొట్టుకుని వున్న చీరె కట్టుకొని వున్నదామె. శరీరమంతా మడ్డిగా వుంది. జుట్టు చెల్లాచెదురై ముఖమంతా పరుచుకొని వుంది.

ఆమె వెనుక ఒక గుడ్డి యువకుడు, కర్ర పట్టుకొని అడుగులు వేస్తున్నాడు. అతని దుస్తులు మరింత అసహ్యంగా వున్నాయి.

"పో పో... అడుక్కు తినటానికి వేళాపాలాలేదు. అవతలికి పో..." అంటూ కసురుకున్నాడు ఒక వ్యక్తి.

బిచ్చగత్తె ముఖం చిన్నబోయింది. తలవంచుకుని మరో వ్యక్తి దగ్గిరికి పోయింది.

"ఏం పిల్లా! ఇలా అడుక్కు తినటం దేనికి? కాస్త శుభ్రమైన బట్టలు కట్టుకొని మార్కెట్ దగ్గిరికి వెళ్ళు..." అంటూ సలహాయిచ్చి వెకిలిగా నవ్వాడతను.

ఆమె మలిన ముఖం కోపంతో కందిపోయింది. ఏదో అనటానికి నోరు తెరిచింది. అదే సమయంలో ఆమెవెనుక నిలబడిన యువకుడు ముందుకు అడుగు వెయ్యబోయి బోర్లాపడ్డాడు. దెబ్బ తగిలింది కాబోలు... "అమ్మా!" అని అరిచాడు బాధగా.

గిరుక్కున వెనుతిరిగి అతనికి చేయి అందించి లేపి నిలబెట్టిందా బిచ్చగత్తె.

"ఈ బాబులు ఏదో పనిమీద వున్నట్లున్నారు. వీళ్ళని అడిగి లాభంలేదు ముందుకు పద..." అన్నాడతను మోకాలును సవరించుకుంటూ.

ముందుకు దారి తీసిందామె. ఫిరాజుద్దీన్ బంగ్లా సమీపంలోకి వెళ్లింది.

"కాలు నేలకు ఆనించటానికి వీలు కావటంలేదు... కాస్త నీడ వుందేమో చూడు. కూర్చుని పోదాం..." అన్నాడా గుడ్డివాడు.

ఫిరాజుద్దీన్ బంగ్లా ఆవరణను ఆనుకొని ఒక పెద్దచెట్టు వుంది. దాని నీడలో గుడ్డి యువకుణ్ని కూర్చో పెట్టిందా బిచ్చగత్తె.

“ఏయ్! ఇక్కడికి ఎవరూ రాకూడదు... ఇంకెక్కడికైనాపొండి.... వెళ్ళండి. ఇక్కడినుంచి వెళ్ళిపొండి...” అంటూ వారిని సమీపించారు, బంగ్లాకు కాపలా ఉన్నవారిలో ఇద్దరు పోలీసులు.

“అయ్యా... ఎక్కడికి పోయినా యిదేమాట అంటున్నారు అందరూ.. ధర్మదాతలు!! మీరు కూడా కాదంటే మేం ఎక్కడికి పోతాం?” దీనంగా ముఖంపెట్టి మరింత దీనంగా అన్నదిఆ బిచ్చగత్తె.

ఏమనుకున్నారోగాని, వారిద్దరూ మారుమాట్లాడకుండా వెనుతిరిగి తమ స్థానాలకు వెళ్ళి నిలబడ్డారు.

గుడ్డి యువకుడు చిరుగులు పడిన కంబళీ నొకదాన్ని కప్పుకొని పడుకున్నాడు. అప్పుడప్పుడూ పెద్దగా అయ్యా అమ్మా అని బాధగా మూలుగుతున్నాడు అదరికీ వినిపించేటట్లు.

ఆ దారిన వచ్చే పోయేవారికి అడ్డుపోయి బిచ్చంఎత్తటం ప్రారంభించింది ఆ బిచ్చగత్తె, మధురమైన గొంతుతో పాటలు పాడుతూ. ఆమె పాటలు పోలీసులను బాగా ఆకర్షించాయి.

రెండు గంటల వేళకు వారందరికీ పోలీస్ వ్యాన్ లో భోజనాలు వచ్చాయి. తమతోపాటు ఆమెనుకూడా పిలిచి భోజనం పెట్టారు. సగం

తాను తిని, మిగిలిన సగాన్ని తీసుకుపోయి ఆగుడ్డి వాడిని లేపి, తినిపించిందామె.

"ఏం పిల్లా? ఆకబోది మీద నీకెందుకింత మమకారం? కాస్త కన్నూ ముక్కు సరిగ్గా వున్నవాణ్ణి చూసి కట్టుకోలేకపోయావా?" ఒక కానిస్టేబుల్ బిచ్చగత్తెను పరామర్శించాడు ఆమె ముద్దలు కలిపి గుడ్డివాడి నోటికి అందిస్తుండటం చూసి.

"కళ్ళు లేకపోతే ఏం బాబూ? దారి చూపించటానికి నేనున్నాను గదా!!" అన్నది ఆమె. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో గుడ్డి వాడిమీద ఆమెకున్న అనురాగాలు.. కొట్టవచ్చినట్లు కనిపించాయి.

పరామర్శించిన కానిస్టేబుల్ పజిల్ అయ్యాడు. అతనికి ఏమీ అర్థంకాలేదు. ఆఫ్టరాల్ ఒక బిచ్చగత్తె.. ఎంత లోతుగా మాట్లాడుతున్నది!!

సాయం సమయం అయింది.... మెల్లిగా ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది అంధకారం.

పోలీసులు బంగ్లా గేటు ముందు బెడ్డింగులు పరుచుకున్నారు. నలుగురు మాత్రం రైఫిల్స్ తో గోడను ఆనుకొని నిలబడి వున్నారు.

టైం మెల్లిగా ముందుకు సాగింది. పన్నెండు గంటలు కొట్టింది ఫిరాజుద్దీన్ బంగ్లా ముందున్న ఒక ఇంటిలోని గోడ గడియారం.

కప్పుకున్న కంబళీని పక్కకు విసిరి మెల్లిగా లేచాడు చెట్టుక్రింద గుడ్డి యువకుడు. రెండు నిముషాలపాటు కదలకుండా చెట్టు మొదలుకు ఆనుకొని కూర్చున్నాడు.

బంగ్లా గేటు ముందు నిలబడి వున్న పోలీసులు కునికిపాట్లు పడుతున్నారు. వీధి చివర తచ్చట్లాడుతున్న ఆగంతకులు పక్కలకు చూస్తూ వున్నారు.

ఎవరూ తనను గమనించటం లేదని నిర్ధారణ అయిన మరుక్షణం నీడలా నిశ్శబ్దంగా లేచాడు గుడ్డి యువకుడు. ఒక అడుగు వెనక్కివేసి ఒక్కసారిగా గాలిలోకి జంప్ చేశాడు.

ఐదు అడుగులు ఎత్తే వుంది ఆ ప్రహరీ గోడ. కన్నుమూసి కన్నుతెరిచేటంతలో దాని మీదినుంచి పోయి అవతల వున్న క్రోటన్స్ లో పడ్డాడు. పడిన రెండు నిమషాల దాకా అక్కడి నుంచి కదలలేదు. కళ్ళు ఆ పరిసరాలకు అలవాటు పడేదాకా ఆగి, పాములా మోకాళ్ళమీద పాకుతూ ముందుకు జరిగాడు. కూలిపోయిన బంగ్లా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=220**